క్లుప్తంగా

నేడు ప్రజావాణి

మధిర/ఏన్కూరు: విద్యుత్ శాఖకు సంబంధించి సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మధిర సబ్ డివిజన్ ఏడీఈఎం అనురాధ, ఏన్కూరు ఏఈ ఉమాకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధిరలో, ఏన్కూరులోని విద్యుత్ కార్యాలయం నందు విద్యుత్ సంబంధిత ఏ సమస్యనైనా ప్రజావాణి కార్యక్రమం ద్వారా విన్నవించుకోవచ్చునని తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మధిర సబ్ డివిజన్ పరిధిలోని మధిర టౌన్, మధిర రూరల్, ఎర్రుపాలెం, మామునూరు ఏఈ కార్యాలయాలతో పాటు మధిర సబ్ డివిజన్, మధిర ఎలక్ట్రికల్ రెవెన్యూ కార్యాలయం నందు, ఏన్కూరు మండలంలోని వినియోగదారులు తమ వినతులను అందజేయవచ్చునని తెలిపారు.

రామాలయానికి పుస్తకాలు బహుకరణ


పుస్తకాలు అందిస్తున్న ఆదినారాయణ

వైరారూరల్: మండలంలోని కొండకొడిమ గ్రామంలోని రామాలయానికి ఆదివారం ఏపీలోని జగ్గయ్యపేట గ్రామానికి చెందిన ఆదినారాయణ భాగవతం, రామాయణం, భగవత్‌గీత, నీతి కథలు, హిందూ ధర్మం, పరిరక్షణ వంటి సుమారు 70 రకాల పుస్తకాలను ఆలయానికి బహుకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొప్పుల వెంకటకృష్ణరావు, కార్యదర్శి బోనాల వీరభద్రరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


వెంకటేశ్వరరావుకు నగదు అందిస్తున్న ఫొటోగ్రాఫర్లు

సత్తుపల్లిరూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న దుద్దేపూడి ఫొటోగ్రాఫర్ వెంకటేశ్వరరావుకు సత్తుపల్లి ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ రూ.11వేలు ఆర్థిక సాయం అందించారు. సత్తుపల్లి మండలం కాకర్లపల్లిలో ఆదివారం సత్తుపల్లి మండలం ఫొటో, వీడియో గ్రాఫర్ల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఫొటోగ్రాఫర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో పరిమి వెంకటేశ్వరరావు, సుమాంజలి రాము, హరేంద్రనాథ్, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, పాషా, ఎస్.నాగేశ్వరరావు, రవి, కిషోర్, గాంధీ, కృష్ణ పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు గొడుగులు పంపిణీ



గొడుగులు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరా: వైరా లయన్స్‌క్లబ్ వారి ఆధ్వర్యంలో రోడ్డు పక్కన తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకుంటున్న చిరు వ్యాపారులకు ఆదివారం గొడుగులు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పెనుగొండ ఉపేందర్‌రావు, అబ్బూరి రమేష్, చింతలపూడి వెంకటేశ్వరరావు, చింతోజు నాగేశ్వరరావు, మరికంటి రాంగోపాల్,, రిషి వర్మ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

సత్తుపల్లి: మండల పరిధిలోని అమ్మపాలెంలోని మామిడి తోటలో పేకాట రాయుళ్లపై పోలీసులు దాడి చేశారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా.. మరో ఇద్దరు పరారీ అయ్యారు. వీరి వద్ద నుంచి రూ.3,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరప్రసాద్ తెలిపారు.

ఎన్‌కౌంటర్ చేయాలి

ఏన్కూరు: గిరిజన లంబాడి మైనర్ బాలికను కిడ్నాప్ చేసి హత్య చేసిన వారిని ఎన్‌కౌంటర్ చేయాలని ఖమ్మం జిల్లా సేవాలాల్ సేన అధ్యక్షుడు బానోత్ శ్రీకాంత్ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం సేవాలాల్ సేన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ మియాపూర్ పరిధిలో నవాసముంటున్న గిరిజన లంబాడి మైనర్ బాలికను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన నాయకులు పాల్గొన్నారు.

పొలాలకు దారేది ?


రోడ్డుకు అడ్డంగా ఫెన్సింగ్ వేసిన దృశ్యం


విచారణ చేస్తున్న ఎస్సై శంకర్‌రావు


ఎన్నెస్పీ కాల్వపై చేపట్టిన రోడ్డు నిర్మాణం

యథేచ్ఛగా రోడ్డు ఆక్రమించుకుని ఫెన్సింగ్
- ఎన్నెస్పీ కాల్వకట్ట ఆక్రమణ
- అడిగితే మంత్రి పేరుతో బెదిరింపులు
- మండలంలో ఓ బడా పారిశ్రామిక వేత్త దౌర్జన్యం

కొణిజర్ల: ఎప్పుడో తాతల కాలంలో రైతులు ఒప్పందంపై కాలి నడకన ఉన్న రహదారిని.. జన్మభూమి పనుల్లో రైతులంతా కలిసి రోడ్డు నిర్మాణం చేసుకున్నారు. ఇటీవల కాలంలో ఆ రోడ్డు పక్కన భూమి కొనుగోలు చేసిన ఓ బడా పారిశ్రామికవేత్త సదరు రోడ్డును ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేసి రైతులను తమ పొలాల్లోకి రాకుండా అడ్డుకుంటున్నాడు. మా పొలాలకు దారేదని అడిగితే ఇది తన సొంతమని.. నా ఇష్టం ఇవచ్చినట్లు చేసుకుంటానని.. గట్టిగా మాట్లాడితే రాష్ట్ర మంత్రికి సంబంధించిందని బెదిరింపులకు గురి చేస్తున్నాడు.

వివరాల్లోకి వెళితే..

కొణిజర్ల మండలం లక్ష్మీపురంలో సుమారు 400 ఎకరాల పొలాలకు వెళ్లేందుకు గతంలో డొంక కాలి బాట ఉండేది. 2,000 సంవత్సరంలో రైతులు ఒప్పందం తమ భూముల్లో కొంత రోడ్డుకు ఇచ్చి జన్మభూమి రోడ్డు నిర్మాణం చేసుకున్నారు. ఈ భూముల్లో సుమారు 33 ఎకరాల భూమిని ఆంధ్రాకు చెందిన ఓ వ్యక్తి 12 ఏళ్ల క్రితం కొనుగోలు చేసి దానిని రెండేళ్ల క్రితం ఖమ్మం పట్టణంలోని ఓ ప్రముఖ వైద్యశాల యజమానికి అమ్మారు. గత రెండేళ్లుగా సదరు యజమాని కూడా అదే రోడ్డులో పొలానికి వెళ్లాడు. ఇప్పుడు కొత్తగా పెద్దరామచంద్రాపురం గ్రామం నుంచి పొలానికి దారి వేసుకున్నాడు.

ఎన్ఎస్‌పీ కల్వర్టు, కరకట్ట ఆక్రమించుకుని రహదారి..

సదరు యజమాని తన పొలానికి వెళ్లేందుకు దారి ఏర్పాటు చేసుకునే క్రమంలో ఎన్నెస్పీ లొల్లోరిగూడెం మైనర్‌కాల్వను పూడ్చేసి దానిపైన రోడ్డు నిర్మించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఎన్నెస్పీ కరకట్టపై పెద్దపైపు వేసి ఏకంగా రోడ్డు నిర్మాణం చేపట్టి ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకుంటున్నాడు. వానాకాలం కాల్వనీరు విడుదల చేస్తే కింద పొలాల రైతులకు నీరుపారే అవకాశంలేదు. మరోచోట రోడ్డు పక్కనే ఉన్న పిల్ల కాల్వలను పూర్తిగా పూడ్చివేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకుంటున్నారు. సదరు పొలానికి రోడ్డు వేసుకునేందుకు ఎటువంటి అనుమతులు లేకుండా చెరువులో దాదాపు 2 నుంచి 3 వేల ట్రిప్పుల మట్టిని.. టిప్పర్లతో తోలి రోడ్డు నిర్మాణం చేపట్టారు. విషయం సోషల్ మీడియా ద్వారా బయటకు పొక్కడంతో హడావిడిగా శుక్రవారం రూ.50 వేలు డీడీ తీసి మట్టి చేనులోకి తోలుకునేందుకు అనుమతులు తీసుకుని.. దర్జాగా చేను చుట్టూ రోడ్డు వేసుకుంటున్నారు.

ఫెన్సింగ్ అడ్డుకున్న రైతులు..

సదరు యజమాని ఫెన్సింగ్ నిర్మాణం చేపడుతున్న రోడ్డు తమ తాతల కాలం నుంచి ఉందని అటువంటి రోడ్డును మూసివేసి ఫెన్సింగ్ వేయడం ఏంటని రైతులు అడ్డుకున్నారు. పెద్దమనుషుల సమక్షంలో సమస్య పరిష్కరించుకుందామని నిర్ణయించుకున్నప్పటికీ సదరు పారిశ్రామిక వేత్త రాత్రికి రాత్రి ఫెన్సింగ్ రాళ్లు వేయించడంతో ఆగ్రహించిన లక్ష్మీపురం రైతులు ఫెన్సింగ్ రాళ్లు విరగొట్టారు. దీనిపై ఇరు వర్గాల వారు శుక్రవారం రాత్రి కొణిజర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఎస్సై జె.శంకర్‌రావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఇరు వర్గాల వారిని రెవెన్యూ అధికారులతో మాట్లాడుకుని పరిష్కరించుకోవాలని రెవెన్యూ అధికారులకు రాశారు.

రికార్డుల్లో ఉంటే వదిలేస్తా..

నేను రెండేళ్ల క్రితం 33 ఎకరాల భూమి కొనుగోలు చేసుకున్నా ను. సదరు రోడ్డు నా భూమిలోనే ఉంది. రోడ్డు ఉన్నట్లు ఎక్కడా రికార్డుల్లో లేదు. నేను నా భూమిలో ఉన్న రోడ్డు మూసి వేసుకున్నాను. రైతులు దౌర్జన్యంగా మా గుమస్తాలను కొట్టి ఫెన్సింగ్ రాళ్లు పీకేశారు. రికార్డుల్లో ఎక్కడైనా రోడ్డు ఉన్నట్లు చూపించమనండి నేను వదిలేసుకుంటా. నా భూమిలో నేను రోడ్డు వేసినా తప్పేనా.

– బాలకృష్ణ, భూ యజమాని, పారిశ్రామిక వేత్త

తాతల కాలం నాటి రోడ్డు..



మా తాతల కాలం నుంచి మా పొలాలకు వెళ్లేందుకు కాలి బాట ఉంది. దానిని రైతులందరం కలిసి ట్రాక్టర్లు వెళ్లే విధంగా అభివృద్ధి చేసుకున్నాం. ఇప్పుడు మాకు దారి లేకుండా మీకు దిక్కు ఉన్న చోట చెప్పుకోండని బెదిరిస్తున్నారు. గుమాస్తాల చేత దాడులు చేయిస్తున్నారు. మా పొలాలకు వెళ్లేందుకు దారి లేకపోతే రైతులంతా ఇబ్బందులు పడాలి.

– కావూరి సత్యనారాయణ, రైతు, లక్ష్మీపురం

బెదిరిస్తున్నారు..



ఖమ్మం ఆస్పత్రి యజమాని కొన్నది 31 ఎకరాలే. పక్కన దాదాపు 2 ఎకరాల పొలం ఆక్రమిం చుకున్నాడు. ఎన్నెస్పీ కాల్వను ఆక్రమించుకుని కాల్వ కరకట్ట మీదనే బోరు నిర్మించడంతో పాటు రోడ్డు వేసుకుంటున్నాడు. రైతులకు నీళ్లు రాకుండా చేస్తే వాళ్లే పొలాలు అమ్ముకుంటారని దౌర్జన్యం చేస్తున్నాడు. అడ్డుకుంటే ఇది మంత్రిగారి పొలం అని బెదిరిస్తున్నాడు.

– జట్ల సత్యనారాయణ, రైతు, లక్ష్మీపురం

భారీ వర్షం..

- విరిగిపడిన చెట్లు..
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురిసింది. బారీగా ఈదురుగాలులు వీయటంతో రెవెన్యూ కార్యాలయం, కోర్టు ప్రాంతాలు, జవహర్‌నగర్, వాణిగురుకులం రోడ్, ద్వారకాపురి కాలనీ ప్రాంతాలలో భారీ వృక్షాలు పడిపోయ్యాయి. చెట్ల కొమ్మలు 11కేవీ విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. టౌన్–2 ఫీడర్‌లో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు ప్రాంతాలలోని విద్యుత్ తీగలపై పడిన చెట్ల కొమ్మలను విద్యుత్ సిబ్బంది శ్రమించి వాటిని తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.


విద్యుత్ తీగలపై పడిన చెట్ల కొమ్మలను తొలగిస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

కలెక్టర్‌ను కలిసిన చందర్‌రావు



కల్లూరు: వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆదివారం ఖమ్మం క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ముజామిల్‌ఖాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కల్లూరు పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలెక్టర్‌కు చందర్ రావును పరిచయం చేశారు.

ఇతరులకు సాయపడాలి..

మధిర: ఇతరులకు తమ వంతుగా, తమకు తోచిన సాయం చేస్తే.. ఆ దేవుడికి చేసినట్లేనని మధిర నియోజకవర్గ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు ఆళ్ల కృష్ణ, ఉపాధ్యాయుడు చేడే బ్రదర్స్ శ్రీనివాస్, సతీష్ తెలిపారు. ఆదివారం ప్రముఖ సామాజిక సేవకుడు లంకా కొండయ్య గృహం పక్కనే ఉన్న బ్యాంక్ వద్ద కొండయ్య బృందం నిర్వహిస్తున్న మహాత్మా గాంధీ ఉచిత పాత బట్టల కేంద్రానికి పలువురు దాతలు తమ పాత బట్టలను అందించారు. ఈ బట్టలను నిరుపేదలకు, సంచార జాతులకు, అనారోగ్య బాధితులకు అందిచనున్నట్లు కొండయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో లంకా సేవా ఫౌండేషన్ వాలంటీర్లు శ్యామ్, రాంబాబు, గోపి తదితరులు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం

25ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు


జేవీఆర్ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు

సత్తుపల్లిటౌన్: తరగతి గదిలో చేసిన ఆ పాత జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ.. కళాశాల కబుర్లు చెప్పుకుంటూ పూర్వ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1996–99 బీకాం బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ప్రిన్సిపాల్ శీలం వెంకటరెడ్డి, అధ్యాపకులు జి.నర్సింహారావు, వెంకట్, ముత్తయ్యలను సత్కరించారు. స్నేహితులు ఒకరికొకరు పరిచయం చేసుకుంటూ ఆనాటి జ్ఞాపకాలను చెప్పుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం గ్రూప్‌ఫొటో దిగారు. ఇటీవల మృతి చెందిన స్నేహితుడు లక్ష్మణ్‌కు సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దొడ్డా రాజా, ఎండీ కమల్‌పాషా, ఉమామహేశ్వరరావు, మల్లికార్జున్‌రావు, కృష్ణారావు, ఐ.వెంకటేశ్వరరావు, మౌలాలీ, నగేష్, వెంకటేష్, విజయలక్ష్మి, లక్ష్మీప్రసన్న, సుగుణ, కళాశాల ప్రిన్సిపాల్ కె.విజయ్‌కుమార్, చెన్నారావు పాల్గొన్నారు.

దాడులను అరికట్టాలి


మాట్లాడుతున్న వీరభద్రం

కొణిజర్ల: రాష్ట్రంలో గిరిజనులపై జరుగుతున్న దాడులను రాష్ట్ర ప్రభుత్వం అరికట్టాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని మేకలకుంటలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. మైనర్ గిరిజన బాలికలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. గిరిజన హక్కుల పోరాటాల కోసం ఈ నెల 21, 22 తేదీలలో వైరాలో గిరిజన సంఘం రాష్ట్ర స్థాయి రాజకీయశిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ తరగతులను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు తేజావత్ కృష్ణకాంత్, అశోక్ నాయక్, బాష్‌సింగ్, హేమంత్‌నాయక్, నాగరాజు నాయక్, వెంకటేష్, లక్ష్మణ్, అశోక్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు

వైద్య సేవలు అభినందనీయం

వైరా: గత 108 నెలలుగా బోడేపూడి కళానిలయం వైరా వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరం అభినందనీయం అని వైరా పట్టణ ప్రముఖులు చింతనిప్పు వెంకటయ్య అభినందించారు. ఈ వైద్యశిబిరం ప్రతీ నెల 3వ ఆదివారం ఉచితంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు చీకటి భారవి, పిల్లలమర్రి సుబ్బారావులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. అనంతరం వెంకటయ్య వైద్య శిబిరం నిర్వహణకు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కళానిలయం కార్యదర్శి బొంతు రాంబాబు, పాపినేని రమేష్, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ బొంతు సమత, గుడిమెట్ల రజిత, మాదినేని రజిని, గుడిమెట్ల మోహనరావు, అనుమోలు రామారావు తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న వెంకటయ్య

బస్‌షెల్టర్ నిర్మాణం అభినందనీయం


సత్తుపల్లి: గంగారంలో బస్‌షెల్టర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి: మండలంలోని గంగారం సెంటర్‌లో దాసరి వీరారెడ్డి, లక్ష్మీకాంతమ్మ జ్ఞాపకార్థం కుమారుడు వెంకట్రామిరెడ్డి(చిట్టినాయన) రూ.10 లక్షలతో బస్‌షెల్టర్ నిర్మించటం అభినందనీయమని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయితో కలిసి ఆదివారం గంగారంలో పోస్టాఫీస్ భవనం, గౌడ సంఘం కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేశారు. సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బస్‌షెల్టర్‌ను ప్రారంభించి మాట్లాడారు. సేవా కార్యక్రమాలను సామాజిక బాధ్యతగా చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మట్టా దయానంద్ విజయ్‌కుమార్, దాసరి మధుమోహన్‌రెడ్డి, నెక్కంటి సాయిబాబా, చల్లగుళ్ల నర్సింహారావు, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, ఉడతనేని అప్పారావు, శివవేణు, దొడ్డా శ్రీనివాసరావు, ఆర్టీసీ ఎస్ఎం బాలస్వామి, వీబీఓ కిన్నెర ఆనంద్ పాల్గొన్నారు.

మంత్రి, ఎమ్మెల్యే పరామర్శ..

పట్టణంలోని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రామిశెట్టి సుబ్బారావు సతీమణి లక్ష్మీసరోజిని ఇటీవల మృతి చెందగా ఆమె చిత్రపటానికి ఎమ్మెల్యే రాగమయితో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాళులర్పించారు. అదే విధంగా మాజీ జెడ్పీటీసీ హసావత్ లక్ష్మి కుటుంబాన్ని పరామర్శించారు.

కృష్ణవేణికి.. ఎమ్మెల్యే రాగమయి..

పెనుబల్లి : మహిళా కాంగ్రెస్ నాయకురాలు బుక్కా కృష్ణవేణి కుమార్తె తేజశ్విని ఇటీవల మృతి చెందడంతో ఆదివారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి బుక్కా కృష్ణవేణిని పరామర్శించి అన్ని విధాలుగా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు చీకటి రామారావు, చిలుకుబత్తుల చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

మాలతి సేవలు అభినందనీయం: ఎమ్మెల్యే

సత్తుపల్లిటౌన్: పిల్లలకు పాఠ్యపుస్తక బోధనకే పరిమితం కాకుండా మాతృభాషాభివృద్ధి కోసం ఉపాధ్యాయురాలు మాదిరాజు మాలతి చేసిన కృషి అభినందనీయమని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. ఆదివారం సత్తుపల్లిలో ఉపాధ్యాయురాలు మాదిరాజు మాలతి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. 40 సంవత్సరాల పాటు విద్యాబోధన చేసి ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. కార్యక్రమంలో మట్టా దయానంద్, మండల విద్యా నోడల్ అధికారి నక్కా రాజేశ్వరరావు, కాంప్లెక్స్ చైర్మన్ శైలకుమారి, వనమారెడ్డి చెంచిరెడ్డి, చెన్నకేశవరెడ్డి, ప్రసాద్, మధుసూదన్ రాజు, రియాజుద్దీన్, అజయ్‌కుమార్, మధుసూదనాచారి, పద్మజ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా బోనాల సందడి


తొడితలగూడెంలో.. బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు


పెద్దమ్మతల్లి ఆలయానికి..

కారేపల్లి: కారేపల్లిలోని పెద్దమ్మతల్లి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 8వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు పెద్దమ్మతల్లికి మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. కారేపల్లిలోని వివిధ కాలనీలకు చెందిన మహిళలు ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని బోనాలను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు మల్లిఖార్జునశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు చేసి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తురక నారాయణ, పెర్ని వెంకటేశ్వర్లు, తురక రవి, బోళ్ల కోమరయ్య, తురక రాంబాబు, మైప నర్సింహ, ఓరుగంటి రాజు, పాసిన్ని నాగేశ్వర్‌రావు, తాళ్లూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి బోనమెత్తిన తొడితలగూడెం..

మండలంలోని తొడితలగూడెంలో యాదవుల ఆరాధ్య దైవమైన గంగమ్మతల్లికి బోనాల సమర్పణ కార్యక్రమం సందడిగా సాగింది. వర్షాలు సకాలంలో కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని మహిళలు బోనాలతో తరలిరాగా.. యాదవ పెద్దలు సాంప్రదాయ దుస్తులైన గజ్జె లాగులతో చరణకోలా చేతపట్టి నృత్యంతో ఊగిపోతు ఊరేగింపుగా సాగారు. గ్రామస్తులు నూతనంగా నిర్మించుకున్న గంగమ్మతల్లి ఆలయానికి ఊరేగింపుగా చేరుకుని గంగమ్మతల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పెద్దబోయిన ఉమాశంకర్, బండారి నాగేశ్వరరావు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బడిబాట మరిచిన పంతుళ్లు..



కల్లూరులోని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం

- బడుల్లో తగ్గిన విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

కల్లూరురూరల్: ప్రభుత్వ పాఠశాలలో నానాటికి తరిగిపోతున్న విద్యార్థుల సంఖ్యను పెంచి ప్రభుత్వ పాఠశాలల పూర్వ వైభవం తెచ్చేందుకుగాను ఒక మంచి సంకల్పంతో ఏర్పాటు చేసిన బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు పట్టించుకోవటం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ నెల 8వ తేదీ నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం చేపట్టాలని విద్యాశాఖ ఉపాధ్యాయులకు ఒక ప్రణాళికను నిర్దేశించింది. సంబంధింత ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా.. బడిబాట కార్యక్రమం ఆశించిన లక్ష్యాన్ని నెరవేర్చటంలో విఫలమైంది. ఒకపక్క ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి గట్టి పోటీ ఎదురవుతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి లక్షలాది రూపాయల వేతనం తీసుకుంటూ ప్రభుత్వ స్కూళ్లను కాపాడటంలో ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వహించటం దారుణం.

ప్రభుత్వ టీచర్లు బడిబాట పట్టరేమి..?

కల్లూరు మండలంలో పేరువంచ, ముగ్గు వెంకటాపురం, బత్తులపల్లి, రావికంపాడు, వెన్నవల్లి, చెన్నూరు గ్రామాల్లో మాత్రమే మొక్కుబడిగా ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. కల్లూరు మండలంలో 38 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 15 ప్రాథమికోన్నత పాఠశాలలు, 9 హస్కూళ్లు ఉన్నాయి. ఇవి కాక సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉన్నాయి. కల్లూరు మండలంలోని మొత్తం స్కూళ్లలో సుమారు 11వేల మందికిపైగా విద్యార్థులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 7,600 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలుస్తోంది. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులు ఏ మాత్రం పట్టించుకోవండం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రైవేట్ స్కూళ్లతో గట్టి పోటీ..

ప్రైవేట్ టీచర్లు, యాజమాన్యాలు, తమ సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రతి విద్యార్థిని కలుసుకొని తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేస్తుంటే.. ప్రభుత్వ టీచర్లు మాత్రం వారు పని చేసే గ్రామాల్లో కూడా అవగాహన కల్పించడం లేదని, విద్యార్థులు పాఠశాలకు వచ్చినా.. రాకపోయినా సమయానికి పాఠశాలకు వచ్చి, వెళ్లటమే డ్యూటీగా అనేక మంది ఉపాధ్యాయుల వ్యవహారం ఉందని ఆరోపణలు వస్తున్నాయి.

టీచర్లకు విద్యార్థుల నిష్పత్తి లక్ష్యం నిర్ధారించాలి..

కొఠారి కమిషన్ సిఫార్సుల మేరకు ప్రతి ఒక్క టీచర్ కనీసం 35 మంది విద్యార్థులు ఉండాలి. కానీ ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో ఒక్కొక్క టీచర్‌కు కనీసం 10 మంది విద్యార్థులు కూడా లేరు. ప్రతి ఉపాధ్యాయుడికి కనీసం 30 మంది పిల్లలను పాఠశాలలో చేర్పించాలని నియమం నిర్ధారించాలని ప్రజలు కోరుతున్నారు. ముగ్గురు టీచర్లు పనిచేస్తున్న స్కూల్లో కనీసం 100 మంది విద్యార్థులు ఉండాల్సి ఉండగా కేవలం 25 నుంచి 35 మంది పిల్లలు ఉన్నారు. మరికొన్ని పాఠశాలల్లో పదిమంది లోపే విద్యార్థులు ఉన్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించినప్పటికీ టీచర్ల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ నిర్వీర్యమవుతుందని, విద్యాశాఖపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.